

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఘనంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని కుత్బుల్లాపూర్‌లో శ్రీ భూనీళా సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకటేశ్వరాస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, రాజు, భాస్కర్‌చారి, వీరస్వామియాదవ్, విజయేందర్‌రెడ్డి, రాజేందర్, సుప్రసేనారెడ్డి, నల్ల ప్రభాకర్, వెంకటేష్ చేగూరి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట ఆస్పత్రిలో చిన్నారులకు ప్రత్యేక గది

సైదాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పీడియాట్రిక్ వార్డులో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రిక్రియేషన్ రూంను ఎమ్మెల్యే అహ్మద్ బలాల మంగళవారం ప్రారంభించారు. పేదలు ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సురేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



రిక్రియేషన్ రూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

యూటర్న్ సమస్య పరిష్కారానికి కృషి


వనస్థలిపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారిపై యూటర్న్ సమస్య పరిష్కారానికి కృషి చెస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్ హైకోర్టు కాలనీలో వనస్థలిపురం ఈస్టర్న్ కాలనీ సంక్షేమ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ జాతీయ రహదారిపై యూటర్న్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. చింతలకుంట నుంచి హయత్‌నగర్ వరకు చేపట్టిన జాతీయ రహదారి పనుల కారణంగా పరిసర కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదే విషయమై సంబంధిత అధికారులతో తాను చర్చించానని, త్వరలోనే జాతీయ రహదారిపై యూటర్న్ పాయింట్లను ఏర్పాటు చేస్తామని వారు తెలిపారని అన్నారు. ఫుట్‌వే బ్రిడ్జీలు త్వరితగతిన పూర్తి చెయాలని సంబంధిత అధికారులను ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈస్టర్న్ కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు దీపావళి శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

పార్కుల అభివృద్ధికి కృషి


వనస్థలిపురం, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): పార్కుల అభివృద్ధికి తన వంతుగా కృషి చెస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వెనుకాల పార్కు, అభ్యుదయనగర్ వాకర్స్‌ల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి పార్కులను సందర్శించి వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్కుల అభివృద్ధికి మంజూరైన రూ.60 లక్షల నిధులతో సీసీ కెమెరాలు, వాష్ రూమ్‌లు ఏర్పాటుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. డివిజన్‌లో ఉన్న పార్కులను సుందరీకరణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ అధికారి రంజిత్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కాలనీవాసులు సాయికిరణ్‌గౌడ్, అశోక్‌గౌడ్, ముట్టిలింగం తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశా

కొత్తపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల పదవీ కాలంలో కొత్తపేట ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. పదవీ కాలం నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం బీజేపీ కార్యాలయంలో పలువురు నాయకులు ఆయనను కలిసి శాలువాలతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డివిజన్ ప్రజల సహకారంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి తదితరులు

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ముసారాంబాగ్ డివిజన్‌లోని కృష్ణతులసినగర్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ మాజీ అధ్యక్షుడు యాదగిరి సురేందర్, నాయకులు కొంగర ప్రవీణ్, గణేష్, అజయ్, ప్రవీణ్, పరశురాం, సంతోష్, హరి, మల్లేష్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

మా దారెటో చెప్పండి

హయత్‌నగర్ నేతాజీ కాలనీవాసుల వేడుకోలు

- రోడ్డు మూసివేసిన ట్రాఫిక్ పోలీసులు
- సర్వీస్ రోడ్డు పూర్తయ్యే వరకు తెరవమంటున్న ట్రాఫిక్ పోలీసులు
- రోడ్డు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేదంటున్న ఆర్అండ్‌బీ అధికారులు



హయత్‌నగర్‌లో విజయవాడ హైవే నుంచి నేతాజీ కాలనీకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు

హయత్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి హయత్‌నగర్ గ్రామానికి వెళ్లేందుకు నేతాజీనగర్ కమాన్ వద్ద ఉన్న ఒకే ఒక రోడ్డును వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పూర్తయ్యే వరకు రోడ్డును తెరవమని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. హైదరాబాద్ వైపు నుంచి అన్మగల్ హయత్‌నగర్, మునగనూర్, ఇంజాపూర్, తొర్రూర్, కొహెడా, బ్రాహ్మణపల్లి గ్రామాలతో పాటుగా దాదాపు 300 కాలనీలకు వెళ్లేందుకు ఉన్న ఒకే రోడ్డు అది. దానిని మూసివేయడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. హైవే బావార్చికి ఎదురుగా ఉన్న నేతాజీ కాలనీ రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్ పోలీసులు సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసి రాక పోకలు మూసి వేశారు. దీంతో వాహనదారులు హయత్‌నగర్ ఓల్డ్ విలేజీకి వెళ్లడానికి జాతీయ రహదారి పైన రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. మ్యాక్స్ క్యూర్ ఆస్పత్రి నుంచి దసరా గుడి వద్ద నుంచి ఓల్డ్ విలేజీకి వెళ్తున్నారు. అదే విధంగా హైవే పైకి వచ్చే వారు సైతం ఇదే రోడ్డు గుండా వచ్చి హైవే రోడ్డును ఎక్కుతున్నారు.

ఇప్పట్లో పూర్తి చేయని రోడ్డు కోసం..

నేతాజీ కాలనీ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు పూర్తయ్యే వరకు రోడ్డును తీయమని పోలీసులు చెబుతున్నారని స్థానికులు తెలిపారు. సర్వీస్ రోడ్డు ఎప్పుడు పూర్తి చేస్తారని స్థానికులు ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నిస్తే ఇప్పట్లో దానిని పూర్తి చేయమని అంటున్నారని తెలిపారు. ఇప్పట్లో పూర్తి చేయని రోడ్డు గురించి వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు వేలమంది వాహనదారులు ఉపయోగించే రోడ్డును మూసి వేయడం ఏంటని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎటు వెళ్లాలో తెలియక హయత్‌నగర్ ఓల్డ్ విలేజీలో తిరుగుతున్న వాహనదారులు

అన్ని యూటర్న్‌లు మూసి..

రోడ్డు విస్తరణ అధికారులు ఆటోనగర్ నుంచి హయత్‌నగర్ వరకు అన్ని యూటర్న్‌లు మూసి వేసి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్, హైవే బావార్చి వద్ద మాత్రమే తెరిచారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న యూటర్న్ కేవలం అక్కడి నుంచి మరలిపోయో వారికి మాత్రమే ఉపయోగపడుతుంది. హయత్‌నగర్ ఓల్డ్ విలేజీతో పాటు 300 కాలనీలు, పలు గ్రామాలకు వెళ్లేందుకు ఉపయోగపడుతున్న నేతాజీ కాలనీ రోడ్డును ట్రాఫిక్ పోలీసులు మూసివేశారు. చేసేది లేక వాహనదారులు రాంగ్ రూట్‌లో వెళితే ట్రాఫిక్ పోలీసులు చలానాలు విధిస్తున్నారు. మూసుకు పోయిన దారులతో ఎక్కడి నుంచి హైవే పైకి ఎక్కాలో, ఎక్కడి నుంచి రోడ్డును క్రాస్ చేయాలో తెలియక వాహనదారులు హయత్‌నగర్ ఓల్డ్ విలేజీలో తిరుగుతున్నారు. దీంతో గ్రామంలోని చిన్న చిన్న రోడ్లని రద్దీగా మారాయి. అయినా జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, జాతీయ రహదారి అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేతాజీ రోడ్డును పునరుద్ధరించాలి



హయత్‌నగర్‌తో పాటు పలు గ్రామాలకు, దాదాపు 300 కాలనీలకు ఉన్న ఏకైక రోడ్డు మార్గం నేతాజీ కాలనీ రోడ్డు. దానిని మూసి ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. మరో ఆరు నెలలైన సర్వీస్ రోడ్డు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అప్పటి వరకు ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడాల్సిందేనా. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు నేతాజీ రోడ్డును పునరుద్ధరించాలి.

- సామ తిరుమల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్

మలక్‌పేట మార్కెట్‌లో భారీగా మిర్చి నిల్వలు

- రోజు రోజుకూ తగ్గుతున్న ధర

ఓల్డ్‌మలక్‌పేట ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో సరైన ధర రాకపోవడంతో రైతు దిగాలు చెందుతున్నాడు. తన బాధను ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక వచ్చిన రేటుకు తెచ్చిన పంటను అమ్ముకొని ఇంటిబాట పడుతున్నాడు. మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతుల దీనగాథ ఇది. మార్కెట్‌లో ప్రస్తుతం మిర్చి సీజన్ నడుస్తుంది ఉమ్మడి వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి రైతులు పెద్ద ఎత్తున మిర్చి పంట మలక్‌పేట మార్కెట్‌కు తెస్తున్నారు.



మార్కెట్‌లో మిర్చి నిల్వలు

పంటను నిల్వ చెయ్యలేక..

మార్కెట్‌కు తెచ్చిన పంటను నిల్వ చెయ్యలేక రేటు రాకున్నా గత్యంతరం లేక తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. గత సంవత్సరం ఏసీ గోదాముల్లో నిల్వఉంచిన పంటను ఇప్పుడు మార్కెట్‌కు తీసుకురావడం, బయటి రాష్ట్రాలకు ఎగుమతులు ప్రారంభం కాకపోవడంతో ధర పెరగడం లేదని మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు గత సంవత్సరం క్వింటా మిర్చి ధర రూ.22,000 పలుకగా ఈసారి ప్రారంభం నుంచే క్వింటా రూ.16,000 ఉండగా ఇక రానురాను ధర తగ్గుతూ వస్తోంది ప్రస్తుతం తేజ రకం క్వింటా రూ.12,500 తగ్గింది. సూపర్ 10రకం రూ.10,000 అమ్ముడుపోతుంది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి మిర్చి ధర భారీగా తగ్గిందని రైతులు వాపోతున్నారు ఈసారి పంట దిగుబడి తగ్గిందని దానికి తోడు ధర కూడా తగ్గడంతో మిర్చి రైతులు నష్టాలపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత్యంతరం లేక అమ్ముతున్నాం



నేను మార్కెట్‌కు రెండు రోజుల క్రితం మిర్చి తెచ్చాను. ధర పెరుగుతదని చూసా కానీ తగ్గుతోంది. 18 క్వింటాళ్లు తూకం వచ్చింది. సూపర్ 10 రకం ధర క్వింటా రూ. 10వేలు మాత్రమే పలికింది అంతకంటే ఒక్క పైసా కూడా ఎక్కువ ధర పెట్టమన్నారు. రోజురోజుకు ధర తగ్గుతుండడంతో గత్యంతరం లేక తెచ్చిన పంటను వచ్చిన రేటుకు అమ్ముకొని పోతున్నాను.

- శంకర్‌నాయక్, రైతు, వనపర్తి

జీహెచ్ఎంసీ కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తిస్తుంది : కోదండరాం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో జీహెచ్ఎంసీ కార్మికులు చేస్తున్న సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జనసమితి మద్దతు ఇచ్చిన ఐఎన్‌టీయూసీ అనుబంధ మునిసిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జరిగిన జీహెచ్ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి, కనీస వేతనాల బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్, సత్యజిత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఏపీఎస్ గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి శివకుమార్, టీజేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ, జీహెచ్ఎంసీ కార్మిక యూనియన్ నాయకులతో కలిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు చెందిన పలువురు ఉద్యోగులు, కార్మికులు సంజీవరెడ్డి సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జోనల్ ప్రెసిడెంట్ శివకుమార్, కార్యదర్శి శరణ్‌జిత్‌సింగ్, నాయకులు శివరాజ్, మహేష్, నరసింహ, యాదగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శరణ్‌జిత్‌సింగ్‌కు సంఘం కండువా కప్పుతున్న సంజీవరెడ్డి, అదిల్‌షరీఫ్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి : సబితారెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అధికారులకు సూచించారు. అర్ధాంతరంగా ఆగిపోయిన నాదర్‌గుల్- బడంగ్‌పేట్ రహదారి పనులను తిరిగి కొనసాగించాలని, రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు తొలగించాలని సూచించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో సబితారెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు, జారీచేసిన బిల్లులు, మొత్తం ఆదాయ వ్యయాలకు సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన నివేదికను తనకు అందజేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నిధుల వ్యయంపై పలు అనుమానాలు ఉన్నట్లు ఆమె వ్యాఖ్యానించారు. గుర్రంగూడలోని శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని, ఆలోగా తాను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో పార్కు స్థలాల కబ్జా అంశాన్ని హైడ్రా దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకోవడానికి నిర్మించిన ప్రజాభవన్‌లో ఫర్నిచర్‌ను అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ పి.సరస్వతి, డీఈఈలు యాదయ్య, జ్యోతిరెడ్డి, ఏఈ వినీల్‌గౌడ్, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు క్యూ

వనస్థలిపురం/హయత్‌నగర్/ఓల్డ్‌మలక్‌పేట/అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ సోమవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. ప్రజాపాలన, గ్రామసభలు నిర్వహించిన సమయంలో అందుబాటులో లేని వారు మీసేవలో దరఖాస్తు చేసుకుంటున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్, పెద్ద అంబర్‌పేట్, వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, మలక్‌పేట, ఓల్డ్‌మలక్‌పేట, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్ తదితర ప్రాంతాలలోని పలు మీసేవ కేంద్రాలకు మంగళవారం దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో మీసేవ కేంద్రాల వద్ద రద్దీ వాతావరణం ఏర్పడింది. హయత్‌నగర్, శాంతినగర్ మీ సేవ కేంద్రాల వద్ద పెద్దగా జనం లేరు. అప్‌లోడ్ చేయడానికి కొంత సమయం పడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని మున్సిపల్ కాలనీలో ఉన్న మీసేవ కేంద్రంలో కంప్యూటర్లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. రేషన్ కార్డు దరఖాస్తుకు ప్రజలుపెద్ద ఎత్తున వస్తుండడంతో గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తుంది. దరఖాస్తు దారుల నుంచి అఫ్ డవిట్, బ్యాంకు పాసుపుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్, కరెంటు బిల్లు, ఆదాయం సర్టిఫికెట్, గ్యాస్ బిల్లు, టెలిఫోన్‌బిల్లు, పాసుపోర్టు, రెంటల్ అగ్రిమెంట్, ఓటర్ ఐడీలలో నుంచి ఏదైన ఒకటి జతపరచాలని చెబుతున్నారు. ఒక్కో దరఖాస్తు నమోదు చేయడానికి సుమారు 10 నుంచి 15 నిమిషాల సమయం పడుతుందని రోజుకు సుమారు వంద దరఖాస్తులు ఎంట్రి జరుగుతుందని మీసేవ నిర్వహకులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు దరఖాస్తులు స్వీరించనున్నారు.



వనస్థలిపురంలో మీసేవ వద్ద క్యూలో రేషన్ కార్డు దరఖాస్తుదారులు

దరఖాస్తు ఫామ్‌కు రూ.10...

కొత్త రేషన్ కార్డు దరఖాస్తు ఫామ్‌కు జీరాక్స్ సెంటర్ల నిర్వాహకులు రూ.10 వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో ఇదే అదునుగా భావించి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని రేషన్‌కార్డు కోసం వచ్చిన వారు పేర్కొంటున్నారు.

పార్కుల సంరక్షణ బాధ్యత జీహెచ్ఎంసీ తీసుకోవాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీలోని పార్కుల సంరక్షణ, నిర్వహణ బాధ్యతలు జీహెచ్ఎంసీ తీసుకోవాలని, కాలనీలో గతంలో అక్రమంగా ఏర్పాటు చేసిన శ్మశానవాటికను వేరే చోటుకి తరలించాలని కాలనీవెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కాలనీ సభ్యులతో కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.



మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానించిన వినోద్‌రెడ్డి

'ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయండి'

మన్సూరాబాద్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ ఎల్బీనగర్ డివిజన్ కార్యదర్శి మామిడికాయల పరశురాం డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న నగరంలో నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం చైతన్యపురి, ఎల్బీనగర్ చౌరస్తాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రియాజ్, మహేష్, సుభాష్, గోపి, సంతోష్, సురేష్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో హయత్‌నగర్, కొహెడ గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏపీలోని వైజాగ్‌లో ఈనెల 6 నుంచి నుంచి 9వ తేదీ వరకు జరిగిన 2వ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి 17-బంగారు, 5-సిల్వర్, 6-కాంస్య పథకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ కృష్ణగౌడ్ తెలిపారు. విద్యార్థులు పతకాలు సాధించడంలో మాస్టర్లు పవన్‌కుమార్, బాల శివుడు, కృష్ణమూర్తి, జంగయ్య, సతీష్ కీలక పాత్ర పోషించినట్లు ఆయన తెలిపారు.



నీరంకి రవిని అభినందిస్తున్న కాలనీ ప్రతినిధులు

న్యూ మారుతీనగర్ అధ్యక్షుడిగా రవి

కొత్తపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ న్యూ మారుతీనగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా నీరంకి రవి ఎన్నికయ్యారు. సంఘం నూతన ఉపాధ్యక్షులుగా రవికేశవ్, మహేష్ దాయమా, మురళీకృష్ణ, కార్యదర్శిగా తాళ్లపల్లి ప్రభాకర్, కోశాధికారిగా శ్రీనివాస్‌కృష్ణ, నిర్వాహక కార్యదర్శులుగా ఆంజనేయులు, ఎం.శంకర్, ఆనంద్, సంయుక్త కార్యదర్శులుగా అరుణ్‌కుమార్, డి.సంతోష్‌కుమార్, పద్మ ఎన్నికయ్యారు.

'కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ సబ్సిడీలకు భారీ కోత'

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ, శ్రామికవర్గాలకు వ్యతిరేకంగా ఉందని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి ఆరోపించారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో వ్యవసాయ సబ్సిడీలకు భారీ కోత పెట్టారని, ఒక్క ఎరువుల రాయితీలోనే రూ. 11వేల కోట్లు తగ్గించారన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చల్లా నారాయణరెడ్డి, గంధం బాల్‌రాజ్, నరసం బాల్‌రెడ్డి, శిలం పెంటయ్య, కాంచనపల్లి యాకయ్య పాల్గొన్నారు.

పోకిరీల భరతం పడుతున్న షీటీమ్స్

- క్రిమినల్ కేసుల నమోదుతో పాటు కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాలతో పాటు పని ప్రదేశాలు, ఆన్‌లైన్‌లో మహిళలను వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి.ఉషా విశ్వనాథ్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో నెల రోజుల వ్యవధిలో 163 మంది పోకిరీలను పట్టుకున్నామని, తీవ్రతను బట్టి 18 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. పట్టుబడిన 163 మందిలో 65 మంది మైనర్లు ఉన్నారన్నారు. కుమార్తెల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రిపై, పెళ్లి పేరతో వేధించిన వ్యక్తిపై, ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. అంతేకాకుండా బస్టాపులు, రద్దీ ప్రాంతాల్లో యువతుల వేధిస్తున్న పలువురు పోకిరీలను అదుపులోకి తీసుకున్నారు. వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

బాలికపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఎల్బీనగర్‌లో నివస్తున్న ఆటోడ్రైవర్ షేక్ ఇమాం (27) 8 ఏళ్ల బాలికపై కన్నేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికకు మాయమాటలు చెప్పి, అపహరించుకొని పోయి లైంగిక దాడి చేశాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన ఎల్బీనగర్ పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పును వెలువరించారు.